
# మొండివాడు

- పాలడుగు వెంకటేశ్వరరావు



ఈ రోజుల్లో ఇంజనీరింగు కాలేజీలో సీటు రావటమంటే, సొల్లు కబుర్లు చెప్పినంత సులభం గాదు. కుటుంబరావు ఇంటర్మీడియట్ ఫస్ట్ క్లాసులో పాసయాడు. గ్రూపులో తొంభయి శాతం పైగా కూడా మార్కులు తెచ్చుకున్నాడు! ఎంట్రెన్సు పరీక్ష రాసాడు. ర్యాంకూ తెచ్చుకున్నాడు. అయినా, స్టేటులో అతనికి సీటురాలేదు! సుమారు మూడు నెలలపాటు భూషయ్య పడిన ఆరాటం, ఆ విధంగా నీరుగారి పోయింది! అంత మాత్రానికే భూషయ్య, తాటాకుల మంటలాగా, చల్లబడిపోలేదు. కొడుకున్తీసుకుని బెంగుళూరు వెళ్లాడు. మద్రాసు వెళ్ళాడు. మణిపాల్ వెళ్లాడు. గుల్‌బర్గా వెళ్లాడు. టయిమయిపోయిందనీ,ఎడిష్మన్సు క్లోజు చేసామనీ చెప్పారు వాళ్ళు. కాని అంతటితో వదలిపెట్టేరకం గాదు భూషయ్య. ఈపళాన సరాసరి బళ్ళారి వెళ్ళాడు. అక్కడ ముప్ఫయిఅయిదు వేలు కట్టి, కొత్తగా కట్టిన ఇంజనీరింగు కాలేజీలో, కొడుకును చేర్పిగానీ, ఇంటికి రాలేదు! అటువంటి మొండిమనిషి భూషయ్య!

కుటుంబరావుది అంతా తల్లిపోలిక. ఖర్చు పెట్టటంలో అతన్ది పెద్ద చెయ్యి. మొదటి సంవత్సరం చదువు ముగించేసరికి అతని ఖర్చు పది వేలదాకా ప్రాకింది! అయినా, అవేమీ ఏ మాత్రం లెక్కపెట్టలేదు భూషయ్య. ఎంత ఖర్చయినా సరే, కొడుకు ఇంజనీరు కావటమే అతని ధ్యేయం.

అంతవరకూ ఏ తకరారూ లేదు. ఆ తరువాతే మొదలయింది గ్రంథం!

ఆ సంవత్సరం, దసరా సెలవులకి, కుటుంబరావు, కడవకల్లు కోటయ్యగారింటికి వెళ్ళి వచ్చాడు. దసరా సెలవులు ఇరవై రోజులయితే, అందులో పదిహేను రోజులు, కుటుంబరావు, అక్కడ్నే గడిపి రావటంతో, భూషయ్యలో అనుమాన బీజం మొలకెత్తి, అది పిశాచి రూపం ధరించింది.

సదరు కడవకల్లు కోటయ్య, భూషయ్య ధర్మపత్ని శేషమ్మకి, స్వయానా అన్నగారవుతాడు. పదిహేనేళ్ళ ప్రాయంతో, రెపరెపా ఎదిగివస్తూ, అందాల బొమ్మలాగా, రూపు దిద్దుకుంటున్న రాజ్యం, అతని కూతురు. ఆమెవి, చేపల్లాంటి పెద్ద పెద్ద కళ్ళు! కొనదేలిన సంపెంగపువ్వులాంటి నాసిక! ఎర్రని నోరూరించే పెదాలు! దానిమ్మ గింజల్లాంటి పలువరస! నునుపుదేలి కొరుక్కుతినాలనిపించే చంపలు! కుదుమట్టమయిన ఆకర్షణీయమయిన శరీరాకృతి!

భూషయ్య అనుమానంలో నిజం లేకపోలేదు!

కుర్రవాడు ప్రేమలో పడ్డాడు. అమ్మాయికీ ఇష్టమే!

ఈ సంగతి కోటయ్యకీ, అతని భార్యకీ ఇష్టమే. ఆ మాటనే ఆ మధ్యన కోటయ్య, శేషమ్మతో ప్రస్తావించాడు. ఆమె తక్షణం తన అంగీకారం తెలియజేసింది. కాని– తుది నిర్ణయాన్ని పార్టీ హైకమాండ్‌తోనే చర్చించి, తేల్చుకోవలసిందిగా సూచించింది. కడవకల్లు కోటయ్య గుండెల్లో రాళ్ళు పడ్డాయి. పార్టీ హైకమాండ్ భూషయ్యంటే, సామాన్యుడు గాదు.

మొదటలో భూషయ్యకీ, ఏమీ లేకపోయినా, ఆ తరువాత రకరకాల వ్యాపారాలు చేసి, తన తెలివి తేటలతో బాగా పైకి వచ్చి, ఈనాడు మంచి స్థితిపరుడయినాడు. ఏమంత ఆస్తిపాస్తులు లేని కోటయ్య అంటే, అతనికి చిన్నచూపు. అసలు ఆ చూపుకే కోటయ్య కొండలా క్రుంగిపోయి సగమయి పోతాడు. ఇంత భూషయ్య, నోరు తెరిస్తే చాలు! కోటయ్య గజగజలాడుతాడు. అది నోరుగాదు. అమెరికావాడి ఆయుధాగారం. ఏమీ లేకపోయినాసరే, గాలిని పోగుచేసి, తిట్టిన తిట్టు తిట్టకుండా, అరగంటపాటు తిట్లవర్షాన్ని కురిపించి, ఎదటివాడ్ని కుదేలు చేయగల శక్తి, భూషయ్య నోరుకున్నది! ఆ అనుభవం కోటయ్యకి గతంలో చాలాసార్లు అయింది. ఆ కారణంగా కోటయ్యకి, బావగారంటే సింహస్వప్నమే!

అందువలన, కోటయ్య ఆ విషయంలో భూషయ్యజోలికి పోకుండా, కుటుంబరావుతో ప్రస్తావించాడు, తెలివిగానే. ఎంత లేకపోయినా ప్రాక్టీసులేని లాయరనిపించాడు.

'దాన్దేముందిలే మామయ్య! మేనరికాన్ని నాన్న

మా(త్రం ఎలా క్కాదంటాడూ?" అన్నాడు కుటుంబరావు.

'మీ నాన్న సంగతి నీకు తెలీదురా బాబూ! ఆయన మొండివాడు. పట్టి డబ్బుమనిషి. లక్షలు లక్షలు కట్నం కావాలంటాడు. ఆ లక్షలు నేనెక్కడ తెచ్చి ఇచ్చేదీ?'అన్నాడు కోటయ్య.

'మీ రాజ్యమే, నాకు పెద్ద కట్నం. నాకింకేమీ కట్నకానుకలు అక్కర్లేదు. నేను రాజ్యాన్ని తప్ప ప్రపంచంలో వేరెవర్నీ పెళ్ళి చేసుకోను. నామాట నమ్మ' అన్నాడు కుటుంబరావు, భరోసాగా.

'సరే. నీ మాటని నేను నమ్ముతానయ్యా! నీ దొడ్డ మనసుని అభినందిస్తున్నాను కూడాను. కానీ, మీ పూజ్యుడయిన నాన్నను ఎల్లా ఒప్పిస్తావూ? ఆ సంగతి చెప్పు నాకు.' అని కోటయ్య రొక్కించి అడగ్గా, 'బాగా ఆలోచించి ఏదో ఒకటి, చేద్దాంలే' అని అక్కడితో ఆ ప్రస్తావన ఆపేసాడు కుటుంబరావు.

ధీమాగా అలాగ అన్నాడేగాని, కుటుంబరావుకీ, లోపల గుబులుగానే వుంది! ఏం చెయ్యాలా, అని రాత్రింబవళ్ళు ఆలోచించాడు. కంటిమీద సరయిన నిద్ర కరువయింది. భోజనం సహించకపోయింది. చిక్కిపోయి కర్రలాగా అయ్యాడు. చంపలు లోతుకు తోసుకునిపోయాయి.

'అయ్యో! అయ్యో! ఆ తిండేవిట్రా? ఏమయిందీ నీకూ? సరిగ్గా అన్నం తినవు! ఎందుకురా నాన్నా, అల్లా అయిపోతున్నావు?' అంటూ గోల బెట్టింది శేషమ్మ కొడుకుతో.

'నేను శుభ్రంగా, సుష్టుగా భోజనం చేయాలని, నిజంగా కోరుకుంటున్నావా?— అమ్మా నువ్వు?' అని అడిగాడు కుటుంబరావు, వినారంగా.

'ఏం ప్రశ్నరా అదీ? తన బిడ్డ సంతోషంగా వుండాలనీ, తృప్తిగా కడుపునిండా అన్నం తినాలనీ, ఏ తల్లి కోరుకోదురా?!'— లబలబలాడింది శేషమ్మ.

'అయితే ఒక పని చెయ్యి.'

'ఏం చెయ్యమంటావు? నువ్వు ఏమడిగినా క్షణాలలో చేసేస్తాను.'

'నేను రాజ్యాన్ని పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఈ విషయం నాన్నతో మాట్లాడి సెటిల్ చెయ్యి. కాదంటే నేను నిద్రాహారాలు మానేసి చచ్చిపోతాను, అంతే.' అన్నాడు కుటుంబరావు.

ఆ రాత్రే భూషయ్యకి అంతా సవిస్తరంగా చెప్పింది శేషమ్మ.

అది వింటూనే ప్రక్కమీద నుంచి ఎగిరి, ఆంజనేయుడి వలె, గంతేసాడు భూషయ్య. కోపంతో బుసలు గొట్టాడు. కళ్ళు ఎర్రగా అగ్నిగోళాల్లాగా అయ్యాయి.

'ఒసే! నీ అన్న వట్టి దొంగ. పిరికి పంద. కుర్రాడ్ని మాయలోపెట్టి వలలో పడవేసుకున్నాడు. అటువంటి దుర్మార్గుడ్ని నేను ఇంత వరకూ చూడలేదు.' అని నిందించాడు భూషయ్య.

'నన్ను అంటే అన్నారు గాని, మా అన్నయ్యని అంటే వూరుకునేది లేదు.' అంటూ శేషమ్మ ఎదుర్కొంది. మొహం ఎర్రగా చేసుకుంది.

దాంతో, భూషయ్య నిప్పులు తొక్కిన కోతిలాగా అయ్యాడు.

'ఇదిగో. ఇదే చెప్తున్నాను నీకు! ఇక నుంచీ నా దగ్గర ఆ ప్రస్తావన తీసుకురాకు. వెంటనే, నీ ముద్దుల కొడుకుకు నా మాటగా చెప్పు. వాడికి తండ్రిమీద ఏ మాత్రమయినా అభిమానం అనేది వుంటే, నామాట వింటాడు; నా గౌరవం నిలువుతాడు. ఆ లఫంగి కోటయ్య ...'

'అదిగో ఆమాటే అనవద్దనేది!' తీవ్రంగా హెచ్చరించింది శేషమ్మ.

'సరే. అలాగే. ఆ కోటయ్య మాయలోపడి, వాడు నిజంగా నా కొడుకే అయితే నాకు ఎదురు తిరగడు. నా కంఠంలో ప్రాణం వుండగా, ఈ పెళ్ళి జరగదు అర్థమయిందా?' అని ఖండితంగా చెప్పాడు భూషయ్య. ఏడ్చి, ముక్కు చీదుకుంది శేషమ్మ.

ఈ విషయాన్నంతా ప్రక్క గదిలోంచి వింటూ వున్న కుటుంబరావు ఆవేశంతో పళ్ళు పట పట కొరికాడు.

రెండో సంవత్సరమూ, మూడో సంవత్సరమూ గడిచాయి, కుటుంబరావు ఇంజనీరింగు చదువు. కుటుంబరావుకి సంబంధాలు రావటం మొదలయింది. పొరుపూడి వాళ్ళు రెండు లక్షలు కట్నం ఇస్తామన్నారు. జొన్నపాడు వాళ్ళ మూడు లక్షలు ఇస్తామని కబురు చేసారు. మండపేటలో ఒకరు మూడున్నర లక్షలు ఇస్తామంటున్నారని కబురు వచ్చింది. ఎంతగానో ఆనందిస్తూ — ఆ సంగతి శేషమ్మతో సంప్రదించ బోయాడు భూషయ్య.

'నాకేం తెలియదు.'అని ఖచ్చితంగా చెప్పేసింది శేషమ్మ; ముక్కు చీదుకుంది.

ఆ వేసవి సెలవులకి వచ్చాడు కుటుంబరావు. వస్తూ వస్తూ, కూడా ఒక స్నేహితుడ్ని తీసుకు వచ్చాడు. ఖరీదయిన బట్టలు, కళ్ళకి గాగుల్సు, చేతిలో టేప్‌రికార్డరులో స్టయిలుగా వచ్చి కూర్చున్నాడు ఆ అబ్బాయి, మహదర్జాగా.

'ఎవర్రా, ఈ అబ్బాయీ?' అని మొహాన్నే అడిగేసాడు భూషయ్య.

'నమస్కారాలండి' అన్న, ఆ అబ్బాయి నమస్కారాన్ని స్వీకరించాడు భూషయ్య.

'ఆదినారాయణనీ, నా స్నేహితుడు. బెజవాడ. వీళ్ళ నాన్నకి ఆ వూళ్ళో రెండు రైసుమిల్లులూ, మూడు సినిమాహాల్సూ వున్నాయి. బాగా వున్న వాళ్ళు' అని చెప్పాడు కుటుంబరావు.

'ఓహో! అలాగా!'అంటూ సకిలించి, ఆదినారాయణని సాదర పూర్వకమయిన చిరునవ్వుతో, సంభావించాడు భూషయ్య.

ఎవరో వుత్తరం రాసినట్లుగా, రాజ్యాన్ని తీసుకుని ఆ మర్నాడే దిగాడు కోటయ్య. రాజ్యం లోపలికి పోగా, తనని పురుగులాగా, చీమలాగా, దోమలాగా, చూస్తూ పళ్ళు కొరుకుతున్న భూషయ్య కెదురుగా, సోఫాలో కూర్చుని, భూషయ్యని ధైర్యంగా ఎదుర్కొన్నాడు కోటయ్య. పిచ్చిధయిర్యం!

'ఏమిటయ్యా, తిన్నగా యుద్ధానికే వచ్చినట్లు వచ్చావ్!' పరిహాసంగా అన్నాడు భూషయ్య.

'అవును బావా! యుద్ధానికే వచ్చాను' అని, నవ్వాడు కోటయ్య.

అవతల, సోఫాలో కూర్చుని పేపరు చూస్తున్న ఆదినారాయణ, టేప్‌రికార్డర్‌లో వస్తూ వున్న పాటను ఆపి ఏదో మీట నొక్కాడు. రికార్డరు నోరమూసింది.

'నాతో యుద్ధం చేయగల దమ్ములు వచ్చాయన్నమాట నీకు?' అని కోపంగా సవాలు విసిరాడ భూషయ్య.

'అవును. అది సరేగాని, ఈ అబ్బాయి ఎవరూ? అని కోటయ్య అడిగాడు.

'నా పేరు ఆదినారాయణ. మాది బెజవాడ కుటుంబరావు నా స్నేహితుడు. అతనికి మా చెల్లెల్నిచ్చి పెళ్ళి చేస్తాము' అన్నాడు ఆదినారాయణ మామూలుగా.

కోటయ్య తెల్లమొహం పెట్టి చూసాడు! భూషయ్య మొహం సూర్యుడ్ని చూసి, విచ్చుకున్న తామర పువ్వులాగా, వికసించింది!

''వాళ్ళు కోటీశ్వరులు. చాలా కట్నం ఇస్తారు, తెలుసా?' అన్నాడు భూషయ్య.

స్నానంచేసి అలంకరించుకుని, హాల్లోకి వచ్చింది రాజ్యం, మెరుపుతీగలా.

''నేనూ, బావా అలా వూళ్ళోకి వెళ్ళివస్తాం, నాన్నా' అంది రాజ్యం, పరుగుదీస్తూ.

'ఇవతల కొంప అంటుకుపోతుంటే, నువ్వు అతనో ఎందుకే?' అని గట్టిగా, మొత్తుకున్నాడు కోటయ్య. అప్పటికే వీధిలో స్కూటరెక్కికూర్చుంది రాజ్యం. స్కూటర్ కదిలిపోయింది, కుటుంబరావు సారధ్యంలో.

'ఆదినారాయణగారూ! అది జరగటానికి వీలు లేదు. కుటుంబరావు నా మేనల్లుడు, అతనికి మా అమ్మాయి రాజ్యాన్నిచ్చి పెళ్ళి చేస్తాము'' అన్నాడు కోటయ్య ఆవేదన, నిండిన గొంతుకతో, వేడికోలుగా

''ఏమిచ్చి చేస్తావోయి, బోడి?' — కోపంగా అడిగాడు భూషయ్య. ఆదినారాయణ నవ్వుకున్నాడు.

'బంగారు బొమ్మవంటి నా కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తాను, ఇంకా ఏంగావాలి?' ధైర్యాన్ని కూడదీసుకుని అన్నాడు కోటయ్య.

భూషయ్య వికటంగా నవ్వాడు.

'నేనడిగింది అదిగాదు! నువ్వు కట్నం ఎంత ఇస్తావూ? అది చెప్పు ముందు!'

'నయాపైసా కట్నం కూడా ఇవ్వను. కట్నం ఇవ్వటం పుచ్చుకోవటం, చట్ట ప్రకారం నేరం. మరొకసారి ఆ మాట అన్నావంటే, నువ్వు జైలుకి వెళతావు' అన్నాడు, రోషంగా కోటయ్య.

'నీ ప్లీడరు తెలివితేటలు నా దగ్గరసాగవు హనుమంతుడి ముందు కుప్పిగంతులు వెయ్యకు. నా కొడుకు లక్ష్మీ పుత్రుడు. వాడి ఇంజనీరింగ్ చదువుకే లక్షదాకా అవుతుంది. కుర్రవాడు బుద్ధిమంతుడు. అందగాడు. ఎంతలేదన్నా నాలుగు లక్షలుకి తక్కువ కట్నం రాదు. ఆ కట్నం ఇవ్వగలిగిన సంబంధాన్నే మేం చేసుకుంటాం. అంత ఇవ్వగలవా, నువ్వు?'

కోటయ్య నీరుగారిపోయాడు 'నా వల్లగాదు' అన్నాడు, దీనంగా.

వికటంగా గలగలా నవ్వాడు భూషయ్య. 'నక్కకూ, నాగలోకానికీ, పోలికలేదు. దురాశ దుఃఖానికి హేతువు. నీ సంబంధం మా అంతస్తుకు తగదు. అందువలన, ఎలాగూ వచ్చావు, బామ్మర్దీ



రుధిరోద్గారి ఉగాది సందర్భంగా హైదరాబాదులోని సాహితీ సాంస్కృతిక సంస్థ 'కళాకౌముది' వారు డా. దివాకర్ల వెంకటావధానిగారికి సన్మానం చేశారు. సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ చిత్రకారుడు 'శ్రీశంకు' శ్రీ దివాకర్లవారికి దుశ్శాలువ కప్పి మెమెంటోని అందజేస్తున్న దృశ్యం

---

గనుక, ఈ పూట ఇక్కడే భోంచేసి, వెంటనే ఎక్కడుందో, నీ కూతుర్ని పట్టుకుని, మీ వూరు వెళ్ళిపో అది నీకే క్షేమం' అని హెచ్చరించాడు.

'నేను వెళ్ళను' నిశ్చయంగా అన్నాడు కోటయ్య

'వెళ్ళక ఏం చేస్తావయ్యా ?!' ఆశ్చర్యంగా అడిగాడు భూషయ్య.

'ప్రేమించానని చెప్పి, నా కూతుర్ని వలలో వేసుకున్నాడు నీ కొడుకు. ఇప్పుడు పెళ్ళీగిళ్ళీలేదు పొమ్మంటే ఎలా కుదురుతుందీ ?'

'కుదరక ఏం చేస్తుందేం.?!'

'అలా అయితే నేను ఇక్కడ్నే వురివేసుకుని చచ్చిపోతాను. వరకట్నం లక్షలు కావాలని శాసించి, నా కూతురి బ్రతుకును బండలు చేయబూనిన నువ్వే నా చావుకి కారణమని, పోలీసులకి వుత్తరం రాసి మరీ చచ్చిపోతాను' ఏడ్పుగొంతుతో, అరిచాడు కోటయ్య.

'పో. పోయి నీ ఇష్టం వచ్చిన విధంగా, నీ ఇష్టము వచ్చిన చోటు చచ్చిపో. తక్షణం వెళ్ళి ఆ పని చెయ్యి' ఖండితంగా చెప్పాడు భూషయ్య.

'అంత తేలికగా పోలానుకోకు. నీకు బంధుత్వం కంటే డబ్బే ముఖ్యం. ప్రేమించుకుని పెళ్ళి చేసుకుందామనుకుంటున్న ఆ పిల్లల భవిష్యత్తు కంటే, నీ కొడుక్కి రావలసిన వరకట్నమే ముఖ్యం కదూ ?'

## మొండివాడు

'అవును. నాకు అదే ముఖ్యం. కట్నం వదులుకుని, నీ వంటి బికారి మనిషితో వియ్యమందటానికి నాకేం ఖర్మ ?!'

'నువ్వు నరరూప రాక్షసుడువి. నేను నిన్ను సాధించి మరీ చచ్చిపోతాను.'

'అలాగే చెయ్యి. కాని ఇక్కడ న్యూసెన్సు వద్దు. తక్షణం నా ఇంటినుంచి వెళ్ళిపో. ఆదినారాయణగారూ ! ఈ పిచ్చిమనిషి సంగతి మన కెందుకూ ? ఇక చెప్పండి. మీ చెల్లెల్ని మా వాడికి చేసుకోవటం ఖాయం. పోతే, వ్యవహారంలో నాకు మొహమాటం లేదు. చెప్పండి. కట్నం ఎంత ఇస్తారు ?' అని అడిగాడు భూషయ్య.

ఆదినారాయణ చిరునవ్వు నవ్వాడు. కోటయ్య దీనంగా చూసాడు.

కోటయ్య కర్చీపుతో కన్నీరు తుడుచుకుంటున్నాడు. తను పూర్తిగా ఓడిపోయాడన్న ఆలోచన అతన్ని బాగా క్రుంగదీసింది.

'చెప్పండి ఆదినారాయణగారూ ! నేను వ్యవహారం దగ్గర నిక్కచ్చి మనిషిని' అని రొక్కించి అడిగాడు భూషయ్య

'మేం మా చెల్లెలికి కట్నం ఏమీ ఇవ్వం' అన్నాడు ఆదినారాయణ, తాపీగా.

'అదేమిటి ? చిత్రంగావుందే !' అని ఆశ్చర్యపోయాడు, భూషయ్య. కొన్ని క్షణాలు ఆలోచించి, 'ఓహో ! అయితే ఆస్తిలో వాటా ఇస్తారన్నమాట ! చెప్పండి. అమ్మాయికి ఏం రాసి ఇస్తారూ ?' అని అడిగాడు భూషయ్య.

'ఏమీ ఇవ్వం !' ఆదినారాయణ ఖండితంగా అన్నాడు, ప్రక్కకి జరుగుతూ. టేపురికార్డరు ప్రక్కకి ఒరిగిపోయింది. టపీమని శబ్దం వచ్చింది. దాన్ని చేతిలోకి తీసుకుని సరిచెయ్యటంలో మునిగిపోయాడు, ఆదినారాయణ

వీధిలో, బర్రుమని స్కూటరు వచ్చి ఆగింది

స్కూటరు దిగి కుటుంబరావూ, రాజ్యమూ చేతులు పట్టుకుని లోపలికి వచ్చారు నవ్వులు కురిపిస్తూ

'నాన్నా ! రాజ్యం, నేనూ గుళ్ళో. పెళ్ళి చేసుకున్నాం మీ ఆశీర్వాదం కోసం వచ్చాం.' అన్నాడు కుటుంబరావు.

భూషయ్య ఎర్రగా అయిన, కళ్ళతో క్రూరంగా చూసాడు. పళ్ళు పటపటా కొరికాడు 'మీరు ఆశీర్వదిస్తానంటే లోపలికి వస్తాం. లేదంటే ఇటునుంచి ఇటే బయటికి పోతాం. చెప్పండి నాన్నా' అన్నాడు కుటుంబరావు, నిశ్చయానికి వచ్చివేసిన వాడిలాగా.

'భూషయ్యగారూ ! ఈ దేశంలో వున్న రాజ్యం లాంటి ఆడపిల్లలందరూ నా చెల్లెళ్ళే ! మీలాంటి పెద్దలు కట్నాలు అంటూ మొండిపట్టు పట్టకూడదు. అది న్యాయంగాదు. వాళ్ళు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. ఆశీర్వదించటం మీ ధర్మం' అన్నాడు ఆదినారాయణ.

'వాడికీ నాకూ ఏం సంబంధం లేదు. ఇంత జరిగాక, నేను వాడి తండ్రినీ కాదు. వాడు నాకు కొడుకూ కాదు.' పౌరుషంగా అన్నాడు భూషయ్య

'మీరు కాదంటే, నేను వాళ్ళని తీసుకువెళ్ళి ఆశ్రయం ఇవ్వగలను. రెక్కలు వచ్చిన పక్షులని మీరు పట్టుకుని గూట్లో కూర్చోపెట్టలేరు ! కానీ మీరు కాదంటే ఈ కోటయ్యగారు ఆత్మహత్య చేసుకుంటారు ! పోలీసులకు వుత్తరం రాస్తారు. గొడవవుతుంది ! మీరు జైలుకి వెడతారు. ఆలోచించండి.' అన్నాడు ఆదినారాయణ సాలోచనగా.

'మీరంతా కలిసి కుట్ర చేసారు. మోసం చేశారు.' అన్నాడు భూషయ్య విషాదంగా గద్గద స్వరంతో.

'అమ్మా ! నేనెందుకు చచ్చిపోతానూ ? నేను ఆత్మహత్యచేసుకోను ఆదినారాయణగారూ!' అన్నాడు కోటయ్య, నవ్వుతూ. అతనికి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

'మీరంతా దొంగలు. ఈ క్షణమే అందరూ నా ఇల్లు విడిచిపోండి' కోపంగా అన్నాడు భూషయ్య. చూపుడువేలుతో గుమ్మంవయిపు చూపించాడు.

దండలు వేసుకుని పెళ్ళి చేసుకునొచ్చిన కొడుకునీ, కోడల్నీ లోపలికి తీసుకువెళ్ళటానికి, పసుపునీళ్ళతో వచ్చిన శేషమ్మ ఆ మాటలు విని. అతనిమీద పడింది.

'మీ మొండితనం ఇకనయినా మానుకోండి అబ్బాయీ, అమ్మాయీ వచ్చి నిలబడి చాలా సేపయింది ! చుట్టుప్రక్కల గోడలమీంచి, నలుగురూ చూస్తున్నారు.' అని హెచ్చరించింది

'పోండి. అందరూ వెళ్ళిపోండి. నాకెవరూ అక్కర్లేదు. నేనెవరికి అక్కర్లేదు.' పిచ్చిగా అరిచాడు భూషయ్య. ఓటమి అతనిలోని ప్రతీకారాగ్నికి గాలి పోస్తున్నది.

'సర్లెండి, భూషయ్యగారూ ! అందరం పోతాం. పోతూ పోతూ, ఈ రికార్డరులో వున్న టేపుని పోలీసులకిచ్చే పోతాం ! వరకట్నం కోసం మీరు సాగించిన బేరసారాలు అన్నీ, ఇందులో రికార్డయి వున్నాయి. మేం బయటికిపోతే, మీరు జైలుకి పోదురుగాని. ఎంతగా చెప్పినా వినిపించుకోని, మీ మంకుతనానికి ఇదే తగిన ప్రాయశ్చిత్తం వెళ్తాం.' అని, కోపంగా లేచాడు ఆదినారాయణ అతన్ని అందరూ అనుసరించబోయారు

శేషమ్మ మొత్తుకుంది. 'సంసారాన్ని బజారులో పడేస్తున్నారు ! మీ మొండిపట్టే మీది మీకు ఇంత జరిగినా, బుద్ధి రాలేదు ! లేవండి. లేచి, వాళ్ళని ఆపండి' అని చెప్పింది.

'అబ్బాయ్ ! ఒరేయ్' అని అరిచాడు, చలనం వచ్చిన భూషయ్య. వెనక్కితిరిగి నాలుగడుగులు వేసిన, కుటుంబరావు ఆగిపోయాడు, ఆ పిలుపుకి

'అయిందేదో అయింది గాని నువ్వు అమ్మాయీ లోపలికి రండి ఆదినారాయణగారూ ! నాకేం భయంలేదు మీరు వెళ్ళి ఆ టేపుని పోలీసు స్టేషన్లో ఇచ్చిరాండి.' అన్నాడు భూషయ్య ఆదినారాయణ నవ్వాడు 'భూషయ్యగారూ ! ఇందులో అసలు టేపే లేదండీ. నేను మీమీద కోపంతో ఆ మాట అన్నానుగాని, ఇందులో ఏమి లేదు' అంటూ, ఖాళీ టేప్‌రికార్డర్‌ని చూపించాడు అందరూ నవ్వారు. అందరితోపాటు భూషయ్య కూడా నవ్వాడు. ★